COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : తేది: ఫిబ్రవరి 1, 2016,
విజయవాడ.

## పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పునరావాసం చెల్లించాలి

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతుల నుండి సేకరించిన భూములకు నష్ట పరిహారం, ఇళ్ళు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సిపిఐ(ఎం) ఖండిస్తున్నది. ఒక వైపున ప్రాజెక్టుల నిర్మాణం చేస్తున్నారు. అదే సందర్భంలో నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా రోడ్డున పడవేసింది. పెండింగ్‌లో ఉన్న నిర్వాసితులందరికీ తక్షణమే ప్రభుత్వం ఆర్ & ఆర్ ప్యాకేజి ప్రకారం పునరావాసం కల్పించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి డిమాండ్ చేస్తున్నది.

దశాబ్దాల నాడు నిర్మించిన శ్రీశైలం, నాగార్జున సాగర్ ల మొదలు నేడు నిర్మాణంలో ఉన్న పులిచింతల, పోలవరం, వంశధార ప్రాజెక్టులన్నింటిలోనూ నిర్వాసితులకు అన్యాయం జరుగుతోంది. నష్ట పరిహారం చెల్లించే సందర్భంలో ప్రస్తుతం ఉన్న చట్టాలను కూడా అమలు చేయడం లేదు. ఉదాహరణకు నూతన ఆర్& ఆర్ ప్యాకేజీ ప్రకారం 18 ఏళ్ళు నిండిన ఆడపిల్లలకూ నష్ట పరిహారం ఇవ్వాలని ఉన్నప్పటికీ ఏ ఒక్క ప్రాజెక్టులోనూ అమలు జరగడం లేదు. అలాగే వికలాంగులు, భర్త విడిచిపెట్టిన వారు, వితంతువులు, అందరికీ ఆర్& ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని 68జివోలో ఉన్నప్పటికీ అమలు జరపడం లేదు. ఎఫ్.ఆర్.ఎల్. పాయింట్ నుండి 100మీటర్ల దూరం వరకు ఉన్న గ్రామాలూ ముంపు గ్రామాలుగానే సవరణలు వచ్చినా చాలా ప్రాజెక్టుల్లో అమలు చేయడం లేదు.

ప్రభుత్వం నష్ట పరిహారాన్ని శాస్త్రీయంగా నిర్ణయించడం లేదు. పెరుగుతున్న ధరలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఫలితంగా నిర్వాసితులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఉదాహరణకు ఇంటినిర్మాణానికి పులిచింతల పరిధిలో 1,18,000/- ఇవ్వగా, పోలవరం మండలంలో 3లక్షల 15వేలతో ఇల్లు నిర్మిస్తుండగా దేవీ పట్నం మండలంలో మాత్రం 53వేలే ఇచ్చారు. ప్రభుత్వం చెల్లిస్తున్న ఈ మొత్తాలు నేడున్న ధరల ప్రకారం ఇంటినిర్మాణానికి ఏమాత్రం సరిపోవు.

వంశధార ప్రాజెక్టులో 9వేల కుటుంబాలు నిర్వాసితులుండగా 3వేల కుటుంబాలకు మాత్రమే ఇళ్ళ స్థలం ఇచ్చారు. మిగిలిన 7వేల కుటుంబాలను పట్టించుకోవడం లేదు. యువతీయువకులకు ఆర్& ఆర్ ప్యాకేజీ కూడా ఇవ్వలేదు. ఇవి చేయకుండా ప్రాజెక్టును 2016లో పూర్తి చేస్తామని ప్రకటించడం నిర్వాసితులకు ద్రోహం చేయడమే.

పులిచింతలలో నేటికీ ఇళ్ళ స్థలాలు ఇవ్వలేదు. కట్టుకున్న ఇళ్ళకు బిల్లులు ఇవ్వడం లేదు. డి-పట్టా భూములకు పట్టా భూములతో సమానంగా పరిహారం ఇవ్వగా, పోలవరంలో భూ విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకోకుండా డి.పట్టా ఉన్న రైతుకు రెండు లక్షలు ఇచ్చి సరిపెడుతున్నారు. ఈ విషయంలో 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయకుండా ప్రభుత్వం ఇష్టానుసారం వ్యవహరిస్తుంది. భూములన్నింటికీ ఒకే విధంగా పరిహారం ఇవ్వడానికి బదులు రెండు విధాలుగా ఇస్తున్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రాజెక్టులో నిర్వాసితులైన ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం లేదా 5లక్షల రూపాయలు లేదా నెలకు 2వేల రూపాయలు చొప్పున 20సం॥లు ఇవ్వాలని ఉంది. వీటిని అమలు చేయడానికి ప్రభుత్వం నిరాకరిస్తున్నది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్వాసితులందరికీ నష్ట పరిహారం చెల్లించి, ఇతర సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకోవాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

(పెనుమల్లి మధు)
కార్యదర్శి